# కార్మికుల రెక్కల కష్టం వెలకట్టలేనిది

- వారి త్యాగం అసామాన్యమైనది
- బీఆర్ఎస్ సర్కారు పథకాలతో కార్మికుల జీవన భరోసా పెరిగింది
- దేశానికి తెలంగాణ ఆదర్శమైంది
- కార్మికలోకానికి మేడే శుభాకాంక్షలు:కేసీఆర్

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): కార్మికుల రెక్కల కష్టానికి వెలకట్టలేమని, వారి త్యాగం అసామాన్యమైనదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొనియాడారు. గురువారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన మేడేను పురస్కరించుకుని కార్మిక, శ్రామిక, కర్షక లోకానికి ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మేడే సందర్భంగా అమరులైన కార్మికుల త్యాగాలకు ఘనంగా నివాళులర్పించారు. మేడే స్ఫూర్తితో రాష్ట్రంలోని శ్రామికుల హక్కులను కాపాడుతూ నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలు వారి జీవన భద్రతకు భరోసా పెంచాయని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెట్టామని పేర్కొన్నారు. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానాలను అమలు చేసి, ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. ఉత్పత్తి, సేవారంగాల్లో పనిచేసే మహిళా కార్మికులకు ప్రత్యేక సౌకర్యాలను, హక్కులను కల్పించి అండగా నిలిచామని తెలిపారు. సింగరేణి కార్మికులు, ఆటోడ్రైవర్లు, పలు పరిశ్రమలు సహా అసంఘటితరంగ కార్మికులకు అన్నిరకాలుగా భరోసా కల్పించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కార్మికవర్గ అనుకూల విధానాలను మరింత బలోపేతం చేయడం, వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేయడం మాత్రమే మేడే స్ఫూర్తికి, ప్రపంచ కార్మికలోక త్యాగాలకు మనమందించే ఘన నివాళి అని కేసీఆర్ తెలిపారు.

# మరో అంతర్జాతీయ సమావేశానికి కేటీఆర్

- ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం ఆహ్వానం
- జూన్ 20, 21 తేదీల్లో సమావేశాలు
- 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అంశంపై ప్రసంగం
- వివరాలు వెల్లడించిన ఫోరం ఫౌండర్



హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మరో ప్రతిష్ఠాత్మక సమావేశానికి హాజరుకానున్నారు. జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లండ్‌లో జరిగే ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం సదస్సుకు ముఖ్యవక్తగా హాజరు కావాలంటూ కేటీఆర్‌ను ఆ సంస్థ ప్రత్యేకంగా ఆహ్వానించింది. 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అనే థీమ్‌తో ఈ ఏడాది సదస్సును నిర్వహిస్తున్నట్టు ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం వ్యవస్థాపకులు సిద్ధార్థ్ సేథీ తెలిపారు. కేటీఆర్ తన అనుభవాలను, ఆలోచనలను అంతర్జాతీయ విద్యార్థులు, వివిధ దేశాల నిపుణులతో పంచుకుంటే చర్చలు మరింత ఫలప్రదంగా, ఆసక్తికరంగా ఉంటాయని ఆయన తెలిపారు. దాంతో పాటు భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో భాగం కావడానికి వారందరికీ స్ఫూర్తిగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడంతోపాటు భారత్‌లో స్థిరమైన అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు ఎలా ఉపయోగపడతాయన్న అంశంపై ఈ సదస్సులో పాల్గొనే వక్తలు ప్రధానంగా చర్చిస్తారని సేథీ పేర్కొన్నారు. వివిధ దేశాల విద్యార్థులు, అధ్యాపకులు, నిపుణులు, పూర్వ విద్యార్థుల సమక్షంలో భారతదేశ ప్రగతి పథాన్ని, తెలంగాణలో అమలుచేసిన వినూత్న విధానాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధి మోడల్‌ను కేటీఆర్ వివరించనున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో కేటీఆర్ పాల్గొనడం వల్ల రాబోయే రోజుల్లో ప్రపంచంపై ఇండియా చూపే సానుకూల ప్రభావాన్ని, నాయకత్వ లక్షణాలను ప్రపంచానికి బలంగా చాటవచ్చన్న అభిప్రాయాన్ని సిద్ధార్థ్ సేథీ వ్యక్తపరుస్తూ ఈ ఆహ్వానాన్ని స్వీకరించి, సదస్సుకు రావాలని కోరారు. ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం సమావేశం యూరప్‌లో భారత్‌కు సంబంధించిన అతి పెద్ద కార్యక్రమం. భారతదేశ పురోగతి, ఆవిష్కరణలను ప్రపంచానికి చాటిచెప్పే వేదిక. మనదేశ అభివృద్ధి, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న మార్పులు, గ్లోబల్ సహకార అవకాశాలపై ఈ సమావేశంలో చర్చలు జరగనున్నాయి. భారత్‌ను ప్రపంచానికి దగ్గర చేయడం, పరిశోధన, సాంకేతికత, విధానాల్లో ఇతర దేశాల భాగస్వామ్యాన్ని పెంచడం ఈ ఫోరమ్ ప్రధాన లక్ష్యం.

# వధూవరులకు కేసీఆర్ దంపతుల ఆశీర్వాదం



మర్కూక్, మే 1: మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకటయ్య యాదవ్ కుమారుడు, ఏఈవో విష్ణువర్ధన్ పెండ్లి గురువారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కల్యాణ మండపంలో జరిగింది. ఈ వివాహానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, శోభ దంపతులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, 'సార్.. మా కొడుకు పెండ్లికి రండి' అని రాష్ట్ర సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు శుభలేఖ అందజేశారు. గురువారం ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో కలిసి వివాహ పత్రికను అందించి ఆహ్వానించారు.

# పేదోళ్ల ఇండ్లు ధమాల్.. పెద్దోళ్లకు సలామ్!

మొదటిపేజీ తరువాయి...

ఆక్రమిస్తే చెరసాలే...' అంటూ ప్రకటనలు చేసినప్పుడు మాత్రం అధికారులు ఇలా బుల్డోజర్లతో బయలుదేరుతారు. నిరుపేదల ఇండ్లను నిర్దాక్షిణ్యంగా నేలమట్టం చేస్తారు. ఇంట్లో ఉన్న సామాన్లు బయటపడేసి మరీ కూల్చివేస్తారు. ఆ అభాగ్యులు ఎక్కడికి పోవాలి? ఎక్కడ తలదాచుకోవాలి? అనేది ఏ మాత్రం పట్టించుకోరు. అక్రమ నిర్మాణాలను కూల్చివేశామంటూ మీడియాకు ఫొటోలు, ప్రకటనలు విడుదల చేస్తారు. ఆ భూమిని కాపాడామంటూ గొప్పలు చెప్పుకొంటారు. నెల రోజుల క్రితం వట్టినాగులపల్లిలో ఈ కూల్చివేతలు జరిగాయి.




బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న రెవెన్యూ శాఖ

### కోర్టులో కేసు గెలిచినా...

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామంలోని సర్వే నంబర్ 54లో 270.17 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఇందులో అత్యధిక భాగం పలు ప్రజా అవసరాలకు వినియోగించారు. ఏపీ ఇంజినీరింగ్ రీసెర్చ్ ల్యాబొరేటరీకి 30 ఎకరాలు, హుడాకు 75 ఎకరాలు, పర్యాటక శాఖకు 50 ఎకరాలు, రైల్వే వర్క్‌షాప్‌కు 12 ఎకరాలు కేటాయించారు. కొంత భూమి ఔటర్ రింగ్ రోడ్డులో పోయింది. హెచ్ఎండీఏకు కొంతకాలం క్రితం 45 ఎకరాలు ఇవ్వగా, గతంలో ఇచ్చిన 75 ఎకరాలు కలుపుకొని కేసీఆర్ ప్రభుత్వం రూ.180 కోట్లతో కొత్వాల్‌గూడ ఎకో టూరిజం పార్క్‌ను అభివృద్ధి చేసింది. మరో ఐదెకరాల్లో చౌడమ్మ దేవాలయం, ఎకరంలో హనుమాన్ దేవాలయం ఉండగా, 15 గుంటలను శ్మశానవాటికకు కేటాయించారు. ఇవన్నీ పోను 52 ఎకరాల భూమి ఉన్నది. ఈ విస్తీర్ణం 26 మంది ప్రైవేటు వ్యక్తుల పేరిట ఉండగా, దీనిపై ఉమ్మడి ఏపీ నుంచి కోర్టులో వివాదం ఉంది. ప్రైవేటు వ్యక్తులు తమ పేరిట ఉన్న 52 ఎకరాలకు పాసు పుస్తకాలు జారీచేయాలని 2006లో రెవెన్యూ శాఖను ఆశ్రయించగా అధికారులు తిరస్కరించారు. దీంతో వారు రెండో అదనపు జూనియర్ సివిల్‌కోర్టు నుంచి డిక్రీ తెచ్చుకొని ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. కొందరు వ్యాపారపరంగా పలువురికి లీజుకు ఇచ్చుకోగా, మరికొందరు చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ అప్పీలుకు వెళ్లింది. ఈ మేరకు 2018లో రంగారెడ్డి జిల్లాకోర్టులో దాదాపు 20 వరకు దావాలు దాఖలయ్యాయి. సుదీర్ఘ విచారణ తర్వాత 'ఈ భూమి ప్రభుత్వానిదే' అంటూ రంగారెడ్డి జిల్లా కోర్టు నిరుడు డిసెంబర్ 3న తీర్పు ఇచ్చింది. ప్రైవేటు వ్యక్తులు సమర్పించిన ఆధారాలు సరిగ్గా లేవని, ఆ భూములు తమవేనని నిరూపించేందుకు సరైన డాక్యుమెంట్లు సమర్పించలేకపోయారని కోర్టు స్పష్టంచేసింది. అయినప్పటికీ, ఆ భూమి స్వాధీనానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పేదలపై విరుచుకుపడే అధికారులు బడాబాబుల విషయంలో స్పందించకపోవడం వెనక ఆంతర్యమేమిటో బహిరంగ రహస్యమేనని పలువురు ఆరోపిస్తున్నారు. పైగా ఎగువ కోర్టులను ఆశ్రయించి స్టే తెచ్చుకోవాలని సదరు వ్యక్తులను కొందరు అధికారులే సూచిస్తుండటం గమనార్హం.

# లోకం పోకడ




## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 45.2°c | 23.4°c |
| నిజామాబాద్ | 43.5°c | 27.9°c |
| రంగారెడ్డి | 42.5°c | 22.3°c |
| మెదక్ | 41.7°c | 27.7°c |
| వరంగల్ | 41.0°c | 25.0°c |
| మహబూబ్‌నగర్ | 40.0°c | 28.0°c |
| నల్లగొండ | 40.0°c | 26.0°c |
| ఖమ్మం | 38.0°c | 27.0°c |
| కరీంనగర్ | 38.0°c | 27.0°c |
| హైదరాబాద్ | 37.8°c | 25.6°c |

# పరీవాహక ప్రాంతాల్లో కన్వెన్షన్ సెంటర్లా?

- ఆ నిర్మాణాలపై వివరణ ఇవ్వండి
- ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ పరీవాహక ప్రాంతాల్లో కన్వెన్షన్ సెంటర్లను నిర్మించడం ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది. జీవో 111కు విరుద్ధంగా చేపట్టిన ఆ అక్రమ నిర్మాణాలపై వివరణ ఇవ్వాలని గురువారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు నీటిపారుదల, పురపాలక శాఖల ముఖ్యకార్యదర్శులకు, హెచ్ఎండీఏకి, జలమండలికి, జీహెచ్ఎంసీ లేక్ ప్రొటెక్షన్ కమిటీకి, ఆనంద కన్వెన్షన్, నియో కన్వెన్షన్, ఆర్య కన్వెన్షన్, కే కన్వెన్షన్, షెల్టెన్ ఉత్సవ్ కన్వెన్షన్ సెంటర్ల యాజమానులకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ యారా రేణుక ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్‌కు వాయిదా వేసింది.

# దంచికొడుతున్న ఎండలు

- రాష్ట్రవ్యాప్తంగా 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్‌లో 45.2 డిగ్రీలు..రెడ్ అలర్ట్ జారీ

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా భానుడు నిప్పులు కక్కుతున్నాడు. ఆదిలాబాద్ జిల్లాల్లో ఎండలకు ప్రజలు అల్లాడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో గురువారం అత్యధికంగా 45.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఆదిలాబాద్ జిల్లాకు రెడ్ అలర్ట్‌ను జారీ చేసినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీచేశారు. గాలిలో తేమ తగ్గడం వల్ల ఉక్కపోత పెరుగుతున్నదని, రాత్రి ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతున్నట్టు అధికారులు వెల్లడించారు. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలలో పెద్దగా మార్పులు ఉండవని తెలిపారు. బుధవారం నుంచి గురువారం వరకు 24 గంటలల్లో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిశాయని పేర్కొన్నారు. నేటి(శుక్రవారం) నుంచి ఈ నెల 7 వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్టు చెప్పారు.

# 'పంచాయతీ' మళ్లీ మొదటికి!

మొదటిపేజీ తరువాయి...

మహారాష్ట్రతోపాటు వివిధ రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికలను కూడా దేశ అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది.

### 42% రిజర్వేషన్ల అమలు అసాధ్యం

'అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే కుల గణన నిర్వహిస్తాం. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి 23,973 మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తాం. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణనూ అమలు చేస్తాం' అని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొంది. కులగణన చేసే అధికారం రాష్ట్రానికి లేదని తెలిసినా కేవలం ఓట్ల కోసమే హామీ ఇచ్చింది. అక్కడితో ఆగకుండా ఆ తర్వాత న్యాయనిపుణులు, బీసీ సంఘాల మేధావులు చెప్పినా వినకుండా అశాస్త్రీయమైన రీతిలో కులగణన నిర్వహించింది. క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు భిన్నంగా స్థూలంగా గణాంకాలను ప్రకటించింది. కులాలు, ఉప కులాల వారీగా లెక్కలను వెల్లడించలేదు. ఇప్పటివరకు సర్వే నివేదికనే బహిర్గతం చేయలేదు. ఆ అసంబద్ధమైన గణాంకాలనే డెడికేటెడ్ కమిషన్‌కు అందజేసింది. ఆ గణంకాలనే ప్రామాణికంగా తీసుకుని బీసీలకు స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లను కల్పించాలని సిఫారసు చేసింది. ఆ నివేదికను సర్కారు బయటపెట్టలేదు. కమిషన్ నివేదిక ఆధారంగా సర్కారు హడావుడిగా బీసీల రిజర్వేషన్ల శాతాన్ని పెంచుతూ అసెంబ్లీలో బిల్లులు ఆమోదించి కేంద్రానికి పంపింది. కానీ కేంద్రం మాత్రం తాజాగా అందుకు విరుద్ధమైన ప్రకటనను జారీచేసింది. రాష్ట్రాల కులగణనకు సాధికారత లేదని తేల్చిచెప్పింది. అంటే ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ సర్కారు పంపిన బిల్లులను కేంద్రం ఆమోదించబోదని తేలిపోయింది. వెరసి బీసీలకు 42% రిజర్వేషన్ల అమలు అందని ద్రాక్షగానే మరోసారి మిగిలిపోనున్నది.

### పాత రిజర్వేషన్లకూ ఎసరు

కాంగ్రెస్ తీరుతో ఇప్పుడు పాత రిజర్వేషన్లకూ ఎసరు వచ్చి పడింది. 2019 జనవరిలో జరిగిన పంచాయతీ ఎన్నికల సమయంలో సుప్రీంకోర్టు ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50% దాటవద్దని స్పష్టంచేసింది. ఆ మేరకు బీసీలకు 22.79%, ఎస్సీలకు 20.53%, ఎస్టీలకు 6.68% ప్రకారం ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం ఆ రిజర్వేషన్లను అమలు చేసేందుకు అవకాశం ఉన్నది. కానీ ఈ పాత రిజర్వేషన్లను అమలు చేయాలన్నా ఆ మేరకు డెడికేటెడ్ కమిషన్ సిఫారసులు తప్పనిసరి. లేదంటే మొత్తంగా బీసీలకు గతంలో అమలుచేసిన 22.79% బీసీ రిజర్వేషన్ సీట్లు కూడా జనరల్ స్థానాలుగానే మారే ప్రమాదం ఉన్నది.

# గ్రూప్-1 ఓ గూడుపుఠాణి

మొదటిపేజీ తరువాయి...

ప్రశ్నించారు. ఐలమ్మ మహిళా విద్యాసంస్థ కాబట్టి అక్కడి పరీక్షా కేంద్రాల్లో మహిళలనే అనుమతించాలనే నిర్ణయం వివక్ష కిందకే వస్తుందన్నారు. బేగంపేటలోని మహిళా కాలేజీతోపాటు మరో 8 ఇతర మహిళా కాలేజీల్లో ఆ విధానాన్ని ఎందుకు అమలు చేయలేదో టీజీపీఎస్సీ చెప్పలేకపోతున్నదని తెలిపారు. అభ్యర్థుల కేటాయింపునకు కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించామని టీజీపీఎస్సీ చెప్తున్న మాట నిజమే అయితే మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఆ సాఫ్ట్‌వేర్ ఎలా సెంటర్లను కేటాయిస్తుందని ప్రశ్నించారు. 45 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ కోసం భద్రతను కోరుతూ పోలీసులకు లేఖ రాసిన అధికారులు.. ఆ తర్వాత పరీక్ష కేంద్రాల సంఖ్యను 46కు ఎలా పెంచారని నిలదీశారు. ఎన్నో కేంద్రాల్లో ఆడ, మగ అభ్యర్థులు కలిసి పరీక్షలు రాశారని ఆమె గుర్తుచేస్తూ.. కోఠి కాలేజీలోనే మహిళలకు ప్రత్యేకంగా టాయిలెట్స్ ఉన్నాయన్న కారణంతో అక్కడ మహిళలకు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం, ఆ అభ్యర్థులే భారీ సంఖ్యలో అర్హత పొందడం విస్తుగొలుపున్నదని తెలిపారు.



### బయోమెట్రిక్‌పై వివరణ ఏదీ?

గ్రూప్-1 మెయిన్ పరీక్షలకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తామన్న టీజీపీఎస్సీ చివరికి అలా చేయకపోవడంపై కనీసం వివరణ కూడా ఇవ్వలేకపోతున్నదని, దీని ఫలితంగా పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్యను 3 రకాలుగా టీజీపీఎస్సీ ప్రకటించి అక్రమాలకు ఆస్కారం ఇచ్చిందని రచనారెడ్డి పేర్కొన్నారు. పరీక్షలు అవ్వగానే 21,075 మంది రాశారని, ఆ తర్వాత అన్ని కేంద్రాల నుంచి వచ్చిన సమాచారాన్ని క్రోడీకరిస్తే ఆ సంఖ్య 21,085కు పెరిగిందని ప్రకటించిన టీజీపీఎస్సీ.. మరోసారి మొత్తం 20,161 మంది అభ్యర్థులు పరీక్ష రాసినట్టు వెబ్‌సైట్‌లో పేర్కొన్నదని గుర్తుచేశారు. ప్రతిష్ఠాత్మకమైన గ్రూప్-1 పరీక్షలకు హాజరైన అభ్యర్థుల సంఖ్యను టీజీపీఎస్సీ నిర్దిష్టంగా చెప్పలేకపోవడం వెనుక జరిగిన బాగోతం ఏమిటో తేల్చాలని కోరారు. అక్రమాలకు అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతోనే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయలేదని స్పష్టం చేశారు. 21 వేల మందిని బయోమెట్రిక్ విధానంలో పరీక్షకు అనుమతించడం చాలా సులభమని, అభ్యర్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రానికి వస్తే ఆ పని చేయవచ్చని ఆమె పేర్కొంటూ.. నోటిఫికేషన్‌లోనూ బయోమెట్రిక్ అమలు గురించి ఉందని చెప్పారు.

### మార్కుల జాబితాలు ఎందుకు అప్‌లోడ్ చేయలేదు?

గ్రూప్-1 మార్కుల జాబితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్న నిబంధనను టీజీపీఎస్సీ ఎందుకు అమలు చేయలేదని రచనారెడ్డి ప్రశ్నించారు. వ్యక్తిగతంగా లాగిన్ అయిన అభ్యర్థులకు వారి మార్కులు మాత్రమే అందుబాటులో ఉండేలా చేయడంలో ఔచిత్యం ఏమిటో బోధపడటం లేదని, అందరి మార్కులను అప్‌లోడ్ చేసి బహిరంగపరిస్తే ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయో, ఎవరు అర్హత పొందేందుకు దగ్గరగా వచ్చారో తెలిసి అభ్యర్థులకు ఉపయుక్తంగా ఉండేదని పేర్కొన్నారు. తొలుత గ్రూప్-1 ఫలితాలను విడుదల చేసినప్పుడు ప్రకటించిన మొత్తం మార్కులకు, సబ్జెక్టుల వారీగా ఉన్న మార్కులకు ఎందుకు పొంతన ఉండటం లేదని నిలదీశారు. ఇలా ఒక అభ్యర్థికి 122 మార్కులు వచ్చినప్పటికీ 100 మార్కులే వచ్చినట్టు పేర్కొనడంపై ఆ అభ్యర్థి ప్రశ్నిస్తే.. తప్పుడు పత్రం సృష్టించారని, క్రిమినల్ కేసు పెడుతున్నామంటూ అధికారులు బెదిరించారని చెప్పారు. ఒక పేపర్‌ను రెండుసార్లు మూల్యాంకనం చేస్తారని, ఆ మూల్యాంకనంలో వేరువేరుగా ఇచ్చే మార్కుల్లో 15% వ్యత్యాసం ఉంటే టీజీపీఎస్సీ మూడోసారి మూల్యాంకనం చేయించాలన్న నిబంధన ఉన్నదని, మార్కులను ఓఎంఆర్ విధానంలో లెక్కించాలన్న నిబంధనను టీజీపీఎస్సీ అమలు చేయలేదని తప్పుపట్టారు. అనంతరం తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ రాజేశ్వరరావు ప్రకటించారు. ఉద్యోగాల కోసం వేలమంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నందున శుక్రవారంతో వాదనలను ముగించాలని న్యాయవాదులకు సూచించారు.

### వేర్వేరు హాల్‌టికెట్లు ఎందుకు?

గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు ఒక హాల్‌టికెట్, మెయిన్స్‌కు మరో హాల్‌టికెట్ ఇవ్వాల్సిన అగత్యం ఏమొచ్చిందని రచనారెడ్డి ప్రశ్నించారు. ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్ నంబర్లను కేటాయించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఇంతకుముందు ఏ పరీక్షలోనూ ఇలా జరగలేదని ఆమె గుర్తుచేస్తూ.. కొంత మందికి లబ్ధి చేకూర్చేందుకే టీజీపీఎస్సీ ప్రత్యేక సెంటర్లను కేటాయించిందని పేర్కొన్నారు. హాల్‌టికెట్‌ను మారుస్తున్నట్టు టీజీపీఎస్సీ ప్రకటించకపోవడాన్ని, ఆ విషయాన్ని కనీసం తన అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టకపోవడాన్ని ఏమనుకోవాలని ప్రశ్నించారు. గ్రూప్-1లో ఖాళీగా ఉన్న 503 ఉద్యోగాలతోపాటు అదనంగా ఏర్పడిన 60 ఖాళీలను కూడా భర్తీ చేసే క్రమంలో టీజీపీఎస్సీ తొలి ఉద్యోగ నియామక నోటిఫికేషన్‌ను రద్దు చేసిందని, నిజానికి ప్రభుత్వ అనుమతి లేకుండా ఆ నోటిఫికేషన్‌ను రద్దుచేసి మరో నోటిఫికేషన్ జారీచేసే అధికారం టీజీపీఎస్సీకి లేదని వివరించారు.

# మేం గుంటనక్కలమే.. ఈ భూమి మాదే!




హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ఏటా జరుపుకొనే 'సుకూన్' ఫెస్ట్‌ను ఈసారి వినూత్నంగా నిర్వహిస్తున్నారు. హెచ్‌సీయూ పరిధిలోని 400 ఎకరాల్లో కాంగ్రెస్ సర్కార్ సృష్టించిన విధ్వంసమే థీమ్‌గా వేడుకలు నిర్వహిస్తున్నారు. సుకూన్-2025కి సంబంధించిన ప్రమోషన్స్, పోస్టర్లలో ప్రధానంగా గుంట నక్క గర్జిస్తున్న ఫొటోలను సింబాలిక్‌గా వాడుతున్నారు. "మేం గుంట నక్కలమే.. ఈ భూమి మాదే" అనే స్లోగన్‌ను విస్తృతం చేస్తున్నారు. "అవర్ డెన్.. అవర్ ల్యాండ్" అంటూ నినాదాలతో పర్యావరణ విధ్వంసాన్ని నిరసిస్తూ చేపట్టిన ఆందోళనలతో స్పెషల్ వీడియో తయారు చేసి సుకూన్ ప్రమోషన్లలో వాడుతున్నారు. - హైదరాబాద్ సిటీబ్యూరో

# టెట్‌కు 1.83లక్షల దరఖాస్తులు

- 3 వరకు ఎడిట్ అవకాశం
- జూన్ 15, 30న ఆన్‌లైన్ పరీక్ష

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్(టెట్-2025)కు మొత్తం 1,83,653 దరఖాస్తులు వచ్చాయని టీజీ టెట్ చైర్మన్ ఈవీ నరసింహారెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. పేపర్-1కు 63,261, పేపర్-2కు 1,20,392 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 3 వరకు వివరాలను సవరించుకునే అవకాశం కల్పిస్తున్నట్టు వెల్లడించారు. https: schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు సవరించుకోవచ్చని స్పష్టంచేశారు. ఆన్‌లైన్ పరీక్షను జూన్ 15, 30న నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి షెడ్యూల్ తేదీని తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు.

# ఆక్రందన పట్టకుండా ఆరోపణలా?

మొదటిపేజీ తరువాయి...

చేసి సమ్మె చేద్దామని నోటీస్ ఇవ్వలేదనే విషయాన్ని సీఎం గుర్తించాలని హితవు పలికారు. 7 నెలల నుంచి పలుమార్లు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను, రవాణా శాఖ మంత్రిని, ఇతర ప్రభుత్వ పెద్దలను కలిసి వినతి పత్రాలు ఇచ్చినా ఎవ్వరూ పట్టించుకోలేదని పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో, విధిలేని పరిస్థితిలో సమ్మె నోటీస్ ఇవ్వాల్సి వచ్చిందని స్పష్టంచేశారు. ఇంకా ఆరు రోజుల గడువు ఉన్నదని, ఈలోగా ముఖ్యమంత్రి సూచించిన విధంగా తాము ప్రభుత్వ పెద్దలతో చర్చలు జరపడానికి ఎప్పుడు పిలిచిన ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ సిద్ధంగా ఉన్నదని తేల్చిచెపపారు. సీఎం సూచించిన అంశాలను క్షుణ్ణంగా చర్చించడానికి తమకు అవకాశం కల్పించాలని కోరారు. ఇన్నాళ్లూ యాజమాన్యం తప్పుడు నివేదికల ద్వారా తప్పుదారి పట్టించిందని, వాస్తవాలను చెప్పేందుకు తమకు అవకాశం కల్పించాలని కోరారు.

### యూనియన్లపై ఆంక్షల ఎత్తివేత ప్రస్తావనేది?

మేడే రోజున ఆర్టీసీ యూనియన్లపై ఆంక్షలను ఎత్తివేస్తారని ఆశతో ఎదురు చూశామని, ఆ అంశాన్ని ప్రస్తావించకపోవడం శోచనీయమని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలు పేర్కొన్నారు. ఆర్టీసీలో సంఘాలు ఉండాలని గతంలో చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ మాటపై నిలబడకపోవడం అందరికీ అసంతృప్తిగా ఉన్నదని తెలిపారు. కార్మికులు రోజుకు 14 నుంచి 18 గంటలపాటు పనిచేస్తున్నారని, ఒక్కరోజు కూడా లీవ్ ఇచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 16వేల మంది రిటైర్మెంట్ అయితే ఒక్క నియామకమైన చేపట్టకపోవడం దారుణమని పేర్కొన్నారు.